క్లుప్తంగా

నేడు విద్యుత్ అంతరాయం

చిత్తూరు కార్పొరేషన్: ట్రాన్స్‌కో అర్బన్ డివిజన్ పరిధిలో విద్యుత్ లైన్ల నిర్వహణ పనుల దృష్ట్యా శనివారం పలు మండలాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని ఈఈ మునిచంద్ర తెలిపారు. పూతలపట్టు, జీడీనెల్లూరు, గుడిపాల, పాలసముద్రం, పెనుమూరు మండలాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరా ఉండదన్నారు.

నేడు జాతీయ లోక్ అదాలత్

పుత్తూరు: పుత్తూరు సబ్ కోర్టు ఆవరణలో శనివారం ఉదయం 10 గంటలకు జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు సీనియర్ సివిల్ జడ్జి, న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షుడు ఎస్.సి.రాఘవేంద్ర శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో సివిల్, మనోవర్తి, చెక్కు బౌన్స్, రాజీ చేసుకోదగ్గ క్రిమినల్ కేసులను పరిష్కరించుకోవచ్చని తెలిపారు. ఇందుకోసం మూడు బెంచ్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు.

నేడు పచ్చికాపల్లం వారపు సంత వేలం పాటలు

వెదురుకుప్పం: మండలంలోని పచ్చికాపల్లం వారపు సంతకు శుక్రవారం వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు డీడీవో మోహన్‌కుమార్ గురువారం తెలిపారు. 2024–25 సంవత్సరానికి సంబంధించి గేటు వసూలు హక్కుకు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద వేలం పాటలు ఉంటాయని పేర్కొన్నారు. ఇందులో పాల్గొనే వారు రూ.20 వేలు డిపాజిట్ చెల్లించాలన్నారు. అంతేగాక రూ.80 వేలకు తక్కువ లేకుండా పాట పాడాల్సి ఉంటుందని తెలిపారు.

దాతల సహకారంతో తొలగిన ముళ్ల కంపలు



గంగాధర నెల్లూరు: మండల పరిధిలోని బొమ్మవారిపల్లె బస్ స్టాప్ వద్ద భారీ ఎత్తున ముళ్ల పొదలు పెరిగి ప్రయాణికులకు ఇబ్బందులు పడేవారు. అంతేగాక చిత్తూరు – పుత్తూరు జాతీయ రహదారిపై వచ్చే వాహనాలు కనిపించేవి కాదు. దీంతో ప్రమాదాలు జరిగేవి. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎంపీటీసీ, సర్పంచులు స్థానిక సన్‌షైన్ ఇండస్ట్రీస్ అధినేతలు చంద్రమోహన్, డేవిడ్ జేసీబీతో ముళ్లకంపలను తొలగించి ఆ ప్రాంతాన్ని శుభ్రం చేశారు. దీంతో స్థానిక ప్రజలు చంద్రమోహన్, డేవిడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

వరద బాధితులకు విరాళాల సేకరణ



కలెక్టర్ వెంకటేశ్వర్‌కు డీడీని అందజేస్తున్న ప్రిన్సిపాల్ కోటేశ్వరయ్య

పుత్తూరు: విజయవాడ వరద బాధితుల సహాయార్థం స్థానిక ఎస్‌ఆర్‌ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు రూ.27 వేలు విరాళం సేకరించారు. వారు సీఎం సహాయ నిధి పేరిట తీసిన డీడీని శుక్రవారం కళాశాల ప్రిన్సిపాల్ జి.కోటేశ్వరయ్య ద్వారా జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్‌కు అందజేశారు. విరాళాలను సేకరించిన కళాశాల ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ విద్యార్థులను కలెక్టర్ అభినందించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ అధిపతులు ఎం.శ్రీనివాసులు, కె.శ్రీనివాసులు, రఘురామన్, విద్యార్థులు పాల్గొన్నారు.

హౌసింగ్ ఏఈ బాధ్యత స్వీకరణ



శ్రీధర్

గంగాధర నెల్లూరు : గంగాధర నెల్లూరు మండల హౌసింగ్ ఏఈగా శ్రీధర్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన శ్రీరంగరాజపురంలో పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, మండలంలో ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం చేస్తామని తెలిపారు.

గంగమ్మ ఆలయానికి రూ.81వేల విరాళం



ఆలయ సభ్యులకు విరాళం అందిస్తున్న ఎన్‌ఆర్‌ఐ కె.జయకుమార్ కుటుంబ సభ్యులు

శ్రీరంగరాజపురం : మండలంలోని తయ్యూరు పాయికట్టు ఆరిమాకుపల్లిలో వెలిసిన శ్రీఆరిమాని గంగమ్మ ఆలయానికి ఎన్‌ఆర్‌ఐ కె.జయకుమార్ కుటుంబ సభ్యులు రూ.81 వేలు విరాళం ఇచ్చారు. ఈ మేరకు మొత్తాన్ని ఆలయ కార్యనిర్వాహక సభ్యుడు, జెడ్పీటీసీ రమణప్రసాద్‌రెడ్డికి అందజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం అమ్మవారికి దర్శించుకోవడానికి కుటుంబ సభ్యులతో వస్తున్నామన్నారు. రానున్న దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ప్రత్యేక అభిషేకం, అన్నదానం చేస్తామని తెలిపారు. మలేషియాలో హిందూ ధర్మపరిషత్ అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. దసరా ఉత్సవానికి ఉభయదారులుగా యోగేశ్వరి, రక్ష, ఎస్ఐ గోపాలకృష్ణారెడ్డి, జీవరత్నమ్మ వ్యవహరించనున్నారు. రామనాథరెడ్డి రెడ్డి, వెంకటరమణ, మునికృష్ణ, లోకయ్య, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం పునరాలోచించాలి



డాక్టర్ చదవాలనే ఆశతో ఉన్న విద్యార్థులకు మొండి చేయి చూపడం తగదు. మా అమ్మాయి డాక్టర్ కావాలని కలలు కంటోంది. గత ప్రభుత్వం మంజూరు చేసిన వైద్య కళాశాలలకు కేంద్రం అనుమతులివ్వకుండా చంద్రబాబు మోకాలడ్డారు. దీనివల్ల వేలాది మంది డాక్టర్ చదువుకు దూరమవుతారు. దీనిపై ప్రభుత్వం పునరాలోచించాలి.

\- వై.శ్రీధర్, వేపగుంట, పుత్తూరు



వైద్య విద్య కలేనా?



నా కుమారైను డాక్టర్‌గా చూడాలని ఆశ. అందుకే ఇంటర్‌లో బైపీసీ చదివించాను. నీట్ కోసం శిక్షణ కూడా తీసుకొంటోంది. మెడికల్ కళాశాల సీట్లను ప్రైవేట్‌పరం చేస్తారని తెలిసి వైద్య విద్య కలేనా అని అనిపించింది. ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటు పరం చేస్తే మాలాంటి వారు డబ్బులిచ్చి చదవడం కష్టం. ప్రభుత్వం సీట్లను, మెడికల్ కాలేజీలను కుదించడం దారుణం.

\- చక్రపాణి, కేబీఆర్‌పురం, పుత్తూరు

కమ్మరులకు కరువైన ఆదరణ

- సబ్సిడీ రుణాలు ఇవ్వని కూటమి ప్రభుత్వం
- తీవ్ర ఇబ్బందుల్లో కమ్మరులు



గడ్డపారను సానబెడుతున్న కమ్మరి

పాలసముద్రం : వంశపార్యంపరంగా వస్తున్న కుల వృత్తులకు రోజురోజుకూ ఆదరణ తగ్గుతోంది. వారు ఇతర పనులు చేయలేక, చేసే పనిలో ఆదాయం అంతంత మాత్రంగానే వస్తుండడంతో కుటుంబ పోషణ కష్టతరమవుతోంది. ముఖ్యంగా కొలిమి పనులు చేసేవారికి ప్రభుత్వ పరంగా చేయూత లేదు. దీంతో వారి పరిస్థితి దుర్భరంగా మారింది. గంగాధరనెల్లూరు నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో సుమారు 325 కమ్మర కుటుంబాలున్నాయి. గతంలో వ్యవసాయ సీజన్ ప్రారంభం కావడంతోనే కొలిమి పనులు జోరుగా సాగేవి. పొలం దున్నేందుకు వినియోగించే పరికరాలను తయారుచేయించుకునేవారు. జూన్, జూలై, ఆగస్టు నెలలో కమ్మర వృత్తి పనులకు సీజన్ ప్రారంభమవుతుంది. వర్షాకాలంలో రైతులకు పనిముట్లు తయారీకోసం కొలిమి వద్దకు రైతులు వెళ్లేవారు. ఉపాధి కూలీలు కూడా తమ వ్యవసాయ పనిముట్లు పదును చేయించుకోవడానికి వెళ్తుంటారు. మరి కొంత మంది ట్రాక్టర్ పనిముట్ల మరమ్మతు కోసం వస్తుంటారు. ఈ మధ్యకాలంలో అధునాతమైన పరికరాలు వావడంతో కొలిమి పనులకు ఆదరణ కరువైంది. అటు ప్రభుత్వం పట్టించుకోకపోవడం, ఇటు తమ వృత్తికి ఆదరణ తగ్గకపోవడంతో బతుకులు రోడ్డున పడ్డాయని కమ్మరులు అంటున్నారు.

కమ్మరి వృత్తి గిట్టుబాటు కాలేదు



నేను 35 ఏళ్ల నుంచి కొలిమి పనులు చేసి జీవనం సాగిస్తున్నా. కుటుంబంలోని అందరూ కష్టపడి కొలిమి పనులు చేసి పనిముట్లు తయారు చేసి వివిధ ప్రాంతాల్లోని షాపులకు అమ్మితే రూ.250 నుంచి రూ.300 వస్తుంది. ఈ ధర గిట్టుబాటు కాలేదు. ప్రభుత్వం మమ్మల్ని ఆదుకోవాలి. – రాధా ఆచారి, బలిజకండ్రిగ

సబ్సిడీ రుణాలు ఇవ్వాలి



కొలిమి పనులు చేసే వారికి ప్రభుత్వం సబ్సిడీతో రుణాలు ఇస్తే ఉపయోగకరంగా ఉంటుంది. పనిముట్లు తయారు చేయడానికి సబ్సిడీతో షెడ్లు ఏర్పాటు చేయాలి. తయారు చేసిన పనిముట్లను ఇతర ప్రాంతాలకు వెళ్లి విక్రయించడం ఇబ్బందికరంగా ఉంది. ప్రభుత్వ మాపై దయ చూపాలి. – మునిరత్నం ఆచారి, తూకుండ్రం

ప్రభుత్వం ఆదుకోవాలి



కమ్మరులు నిప్పు చెగల్లో కొలిమి పెట్టి పెట్టి 40, 50 సంవత్సరాలకే ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ఆ వేడితో శరీరం సత్తువను కోల్పోతుంది. ప్రభుత్వం వారికి 50 సంవత్సరాలకే పింఛన్ మంజూరు చేయాలి. తద్వారా వారికి కొంతమేరకు ఇబ్బందులు తీరుతాయి. – రవి, సీఐటీయూ అధ్యక్షుడు

నేత్రపర్వంగా గ్రామదేవతల ఊరేగింపు




రాజరాజేశ్వరిగా ఓరుగుంటాలమ్మ, విజయలక్ష్మిగా దేశమ్మ



కర్ణాటక వీరభద్ర, వీరగ్రాస నాట్యం

- ఆకట్టుకున్న దేవతల అలంకరణ
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



వానియంబాడి డ్రమ్స్

నగరి : గంగమ్మ జాతరలో భాగంగా ప్రతి ఏటా అత్యంత ప్రత్యేకతను చాటుకునే గ్రామదేవతల ఊరేగింపు కార్యక్రమం శుక్రవారం రాత్రి నేత్రపర్వంగా సాగింది. ఓరుగుంటాలమ్మ దేవతను రాజరాజేశ్వరిగాను, దేశమ్మ దేవతను విజయలక్ష్మిగాను అలంకరించగా భక్తులను అమితంగా ఆకట్టుకుంది. అలంకరణల అనంతరం ప్రత్యేక పూజలు చేసి వాహనాలపై కొలువుదీర్చారు. అనంతరం దిష్టి పూజలు చేసి చావడి నుంచి ఊరేగింపును ప్రారంభించారు. అక్క ఓరుగుంటాలమ్మ ముందు వెళ్లగా, చెల్లి దేశమ్మ ఆమెను అనుసరించింది. భాజాభజంత్రీలు, బ్యాండు మేళాలు, విచిత్ర వేషధారణల మధ్య శనివారం ఉదయం వరకు ఊరేగింపు కొనసాగింది. దారి పొడవునా భక్తులు అమ్మవార్లకు స్వాగతం పలికి కొబ్బరికాయలు కొట్టి మంగళహారతులు పట్టారు. ఊరేగింపును పురస్కరించుకొని ఏర్పాటుచేసిన వానియంబాడి, బళ్లారి డ్రమ్స్, రాజమండ్రి వారి కోయ నృత్యాలు, కర్ణాటక వీరభద్ర వీరగ్రాస నాట్యం ప్రత్యేకతను సంతరించుకున్నాయి. బాణసంచా పేలుళ్లు ఆకట్టుకున్నాయి. ఊరేగింపు ముగిసిన అనంతరం దేవతల ఉత్సవ విగ్రహాలను ఆలయాలకు చేర్చారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటుచేశారు. సీఐ మహేశ్వర్ ఆధ్వర్యంలో పోలీసులు ఆద్యంతం ఊరేగింపుతో పాటు వెళుతూ భద్రతా చర్యలు చేపట్టారు. జాతర నిర్వాహకులు జ్యోతిరెడ్డి, చిరంజీవిరెడ్డి, ఆనం సురేష్, కృష్ణారెడ్డి, బాబు, దయానిధి, జ్యోతినాయుడు, గుణశేఖర్, ఇంద్రారెడ్డి, మదన శ్రీనివాసన్, కోలా బాలాజి, టీవీ వాసు, జనార్థన్, ప్రసాద్, సేడు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



జనసందోహం నడుమ ఊరేగింపుగా వెళుతున్న దేవతలు

రాస్ సేవలు అభినందనీయం




మాట్లాడుతున్న బ్యాంకు మేనేజర్ హరిత, కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు

పుత్తూరు: రాష్ట్రీయ సేవా సమితి సేవలు అభినందనీయమని స్థానిక యూనియన్ బ్యాంక్ మేనేజర్ హరిత అన్నారు. రాస్ కార్యాలయంలో శుక్రవారం సామూహిక వరలక్ష్మీ వ్రతం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మహిళల ఆర్థికాభివృద్ధి కోసం రాస్ సంస్థ చేస్తున్న కృషి ఆదర్శనీయమన్నారు. మహిళలకు వివిధ చేతివృత్తుల్లో ఉచిత శిక్షణ ఇస్తూ పరికరాలను సైతం ఉచితంగా అందించడం హర్షనీయమన్నారు. రాస్ సేవలను సద్వినియోగం చేసుకుని మహిళలు ఇతరులకు తమ వంతు సహాయం అందించాలని సూచించారు. వరలక్ష్మీ వ్రతాన్ని అందరూ కలిసి చేసుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా వృత్తి విద్యలో శిక్షణ పూర్తి చేసుకొన్నవారికి సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం మహిళలకు కానుకలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాస్ అధికారి రవి, పెద్ద సంఖ్యలో మహిళా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

జాబ్ మేళాలో 59 మందికి ఉద్యోగాలు



ఉద్యోగాలకు ఎంపికైన వారికి నియామక పత్రాలు అందజేస్తున్న ప్రిన్సిపాల్ గణేష్

కార్వేటినగరం: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజ్ సీడాప్, డీఆర్‌డీఏ సంయుక్తంగా నిర్వహించిన జాబ్ మేళాలో 59 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్టు ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ గణేష్ అన్నారు. ఐటీఐ కళాశాల ఆవరణలో శుక్రవారం జాన్సన్ ప్రైవేటు లిమిటెడ్, శ్రీరామ్ చిట్స్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్, మెడ్‌ప్లస్, ముత్తూట్ ఫైనాన్స్ ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. 98 మంది విద్యార్థులు హాజరు కాగా 59 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్టు పేర్కొన్నారు. వారికి ఆర్డర్ కాపీలు అందజేసినట్టు వెల్లడించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజేష్, వైస్ ప్రిన్సిపాల్, రీజనల్ కోఆర్డినేటర్ యుగంధర్‌బాబు, చైతన్య, లోకేష్, అబ్దుల్ అజేష్, రసూల్, ధనుంజయులు పాల్గొన్నారు.

వన్యప్రాణుల సంరక్షణలో అధికారుల నిర్లక్ష్యం

కార్వేటినగరం: వన్యప్రాణుల సంరక్షణలో అటవీశాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని సీపీఐ ఎంఎల్ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి సుబ్రమణ్యం ఆరోపించారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. వేటగాళ్లు వన్యప్రాణులను యథేచ్ఛగా వేటాడుతున్నా అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని తెలిపారు. నగరవనం సమీపంలోని కుప్పానిగుంట వద్ద గురువారం నాలుగు అడవి పందులు మృతి చెంది ఉన్నాయని, వాటి గురించి అధికారులను అడిగినా సమాధానం ఇవ్వడం లేదన్నారు. కొన్నాళ్లుగా వేటగాళ్లు వన్యప్రాణులను వేటాడుతున్నారని, వారిపై అటవీశాఖ అధికారులు చర్యలు తీసుకోకపోవడంపై పలు అనుమానాలు ఉన్నాయని దుయ్యబట్టారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి వన్య ప్రాణుల రక్షించాలని కోరారు.

హిందీ భాషలోనూ ప్రావీణ్యం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న హెచ్ఎం భారతి

పుత్తూరు: భారతదేశంలో అత్యధిక శాతం ప్రజలు మాట్లాడే భాష హిందీ అని, ఇందులోనూ విద్యార్థులు ప్రావీణ్యం సాధించాలని గొల్లపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు భారతి తెలిపారు. పాఠశాలలో శుక్రవారం జాతీయ హిందీ భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఏటా సెప్టెంబర్ 14వ తేదీన జాతీయ హిందీ భాషా దినోత్సవాన్ని జరుపుకోవడం ఆనవాయితీ అన్నారు. 14న పాఠశాలకు సెలవు కావడంతో ఒక రోజు ముందుగా కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. హిందీ భాషలో ప్రావీణ్యం సాధిస్తే దేశంలో ఎక్కడైనా ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉంటాయన్నారు. ప్రతి విద్యార్థి హిందీ భాషపై పట్టు సాధించాలని సూచించారు. అనంతరం హిందీ వ్యాస రచన, చిత్రలేఖనం, వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హిందీ ఉపాధ్యాయులు శ్రీరాములు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



పాలసముద్రం: మాట్లాడుతున్న హెచ్ఎం శ్యామల

పాలసముద్రం : పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని శ్రీకావేరిరాజుపురం ప్రాథమికోన్నత పాఠశాల హెచ్ఎం శ్యామల, ఏఎన్ఎం రేవతి తెలిపారు. పౌష్టికాహార మసోత్సవాల్లో భాగంగా అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం పౌష్టికాహారం తీసుకోవడం వల్ల లాభాలపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ పిల్లలకు సమతుల్య ఆహారం అందిస్తే రక్తహీనతను నివారించవచ్చన్నారు. ఆరు నెలల నుంచి మూడేళ్లలోపు చిన్నారులకు బాలామృతాన్ని సరఫరా చేస్తున్నట్లు పేర్కొన్నారు. అంగన్‌వాడీ వర్కర్ క్రిష్ణవేణి, ఎంఎల్‌హెచ్‌పీ సునిత తదితరులు పాల్గొన్నారు.



విజయపురం : మాట్లాడుతున్న సూపర్‌వైజర్ లక్ష్మి

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

విజయపురం : గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తప్పని సరిగా తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మి తెలిపారు. బుచివానత్తం అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు కె.రాణి, టి.లలిత, ఎలిజిబెత్ రాణి పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు అండగా ఉంటాం



నివాళులర్పిస్తున్న కుమారస్వామిరెడ్డి

పుత్తూరు: ఆత్మీయులను కోల్పోయిన వారి కుటుంబాలకు వైఎస్సార్ సీపీ అండగా ఉంటుందని ఆ పార్టీ నేత వై.కుమారస్వామిరెడ్డి భరోసా ఇచ్చారు. పుత్తూరు మండలం వేపగుంట గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు నరసింహులు తండ్రి దేవసుందరం మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న కుమారస్వామిరెడ్డి శుక్రవారం గ్రామానికి వెళ్లి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ ఆప్తులను కోల్పోయినా మనోధైర్యంతో ముందుకెళ్లాలని, పార్టీ అన్ని వేళలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ శంకర్, గ్రామ సర్పంచ్ గిరిజప్రసాద్, నాయకులు వెంకటేష్, సురేష్‌బాబు, హేమాద్రి తదితరులు పాల్గొన్నారు.

కిశోర బాలికలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీవో

నగరి : కిశోర బాలికలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలని సీడీపీవో కృష్ణవేణి అన్నారు. స్థానిక పీసీఎన్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం 100 రోజుల క్యాంపెయిన్‌లో భాగంగా కిశోర బాలికలు ఆరోగ్యపరంగా, సామాజిక భద్రతపరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. బాలికలు పౌష్టికాహారానికి ప్రాముఖ్యత ఇవ్వాలన్నారు. బాల్య వివాహాల వలన కలిగే నష్టాలను వివరించారు. బాలికల అక్రమ రవాణాపై అవగాహన కల్పించారు. బాలికలు బాగా చదువుకోవాలని, అప్పుడే బాల కార్మిక వ్యవస్థ నిర్మూలించవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల సూపర్‌వైజర్ శంకరమ్మ, ఏఎన్ఎం శాంతి, ప్రధానోపాధ్యాయులు శ్యామల, ఉపాధ్యాయులు రేవతి, గోపి, శైలజ, సరిత, అంగన్‌వాడీ కార్యకర్తలు దేవికళ, మీన, సలిమా తదితరులు పాల్గొన్నారు.

ఎం అగరంలో పారిశుద్ధ్య పనులు



తాగునీటి ట్యాంక్‌ను శుభ్రం చేస్తున్న కార్మికుడు

విజయపురం : మండలంలోని ఎం అంగరంలో శుక్రవారం సర్పంచ్ సుధాకర్ పారిశుద్ధ్య పనులు చేయించారు. అదేవిధంగా తాగునీటి ట్యాంక్‌లను శుభ్రం చేయించారు. రోడ్డుకు ఇరు వైపులా ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలు, పేడ దిబ్బలను జేసీబీ ద్వారా తొలగించారు. నిల్వ ఉన్న మురికి నీటిని తొలగించి, ఆయిల్ బాల్స్ వేయించారు. పొడి, తడి చెత్తను వేరు చేసి గ్రీన్ అంబాసిడర్‌కు అందజేయాలని స్థానికులకు సూచించారు.

ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయండి

విజయపురం : జగనన్న ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని హౌసింగ్ ఏఈ డి.ఏలుమలై తెలిపారు. ఆయన శుక్రవారం మండలంలోని వెలుగు సీసీలతో మాట్లాడారు. మండలంలో 250 ఇళ్ల నిర్మాణం ఇంకా పూర్తి కావాల్సి ఉందన్నారు. లబ్ధిదారులతో మాట్లాడి పనులు చేపట్టేలా చూడాలన్నారు. అదేవిధంగా వారికి డ్వాక్రా సంఘం ద్వారా రుణాలు అందేలా చూడాలని సూచించారు.



వెలుగు సీసీలతో మాట్లాడుతున్న ఏవో ఎలుమలై

కోలాహలంగా వినాయకుని నిమజ్జనం




పాలసముద్రంలో నిమజ్జనానికి సిద్ధమైన వినాయకుడు, ఎల్ఎన్ పురంలో వినాయకుడి విగ్రహాన్ని తరలిస్తున్న గ్రామస్తులు

పాలసముద్రం : మండలంలోని పాలసముద్రం, ఎల్ఎన్ పురం గ్రామాల్లో ఏర్పాటుచేసిన వినాయకుడి విగ్రహాలను శుక్రవారం నిమజ్జనానికి తరలించారు. ముందుగా ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. తదుపరి ప్రత్యేక వాహనాల్లో విగ్రహాలను ఉంచి నిమజ్జనానికి తరలించారు. యువకులు రంగులు చల్లుకుని కోలాహలంగా గడిపారు. అనంతరం గ్రామానికి సమీపంలో వున్న చెరువుల్లో నిమజ్జనం చేశారు.

బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి సీతారాం ఏచూరి



సీతారాం ఏచూరికి నివాళులర్పిస్తున్న నేతలు

నగరి : బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి సీతారాం ఏచూరి అని శుక్రవారం సీపీఎం, సీపీఐ, ప్రజా సంఘాల నాయకులు తెలిపారు. నగరి అంబేడ్కర్ విగ్రహం వద్ద శుక్రవారం సీతారాం ఏచూరికి నివాళులర్పించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు మాట్లాడుతూ సీతారాం ఏచూరి ఐదు దశాబ్దాల పాటు ఎర్రబాటలో అగ్రగామిగా నిలిచారని, విద్యార్థి దశలో ఎస్ఎఫ్ఐలో చేరి అంచెలంచెలుగా ఎదిగి సీపీఎం జాతీయ అధ్యక్షుడు అయ్యారని కొనియాడారు. గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని, సమాచార హక్కు చట్టాన్ని తీసుకురావడంలో కీలక భూమిక పోషించారన్నారు. ఆయన మరణం సీపీఎంకు తీరనిలోటన్నారు. సీపీఐ జిల్లా నాయకుడు కోదండయ్య మాట్లాడుతూ సీతారాం ఏచూరి మరణం ఎస్సీ, ఎస్టీ బడుగు, బలహీన వర్గాలకు తీరని లోటన్నారు. కార్యక్రమంలో సీపీఎం నగరి కార్యదర్శులు పెరుమాళ్, షణ్ముగం, సీపీఐ పట్టణ అధ్యక్షుడు వేలన్, ఏఐటీయూసీ నాయకులు బాషా, విజయ్, యుటిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మునిరత్నం, అంబేడ్కర్ యువజన సంఘం జాతీయ కార్యదర్శి గోవింద స్వామి, నాయకులు తంగరాజ్, ఉమపతీ, సందీప్ తదితరులు పాల్గొన్నారు.